చోరీ కేసులో ఒకరి అరెస్టు

రఘునాథపల్లి, డిసెంబర్ 12 : చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై దూది మెట్ల నరేశ్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మాజీ జడ్పీటీసీ మారుజోడు రాంబాబు ఇంట్లో గత నెల 18న చోరీ జరిగింది. దీంతో రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో మండలంలోని వెంకటాయపాలెం టోల్ గేటు వద్ద గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా నల్లగొండ జిల్లా కేతపల్లి మండలం కొత్తపేటకు చెందిన ఊర లింగయ్య అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని పట్టుకుని విచారణ చేపట్టగా రాంబాబు ఇంట్లో చోరీ గురించి చెప్పాడు. అతడి నుంచి రూ.2500 నగదు, పల్సర్ బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.

జాతీయ స్థాయి నెట్ బాల్ పోటీలకు నిహారిక

జనగామ చౌరస్తా, డిసెంబర్ 12 : చత్తీస్‌గఢ్‌లో ఈ నెల 22 నుంచి జరిగే జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీలకు జనగామలోని సాన్ మారియా పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని తాటి నిహారిక ఎంపికైంది. అండర్-14 విభాగంలో నెట్‌బాల్ ఆడేందుకు తెలంగాణ రాష్ట్రం టీమ్ తరపున నిహారిక వెళ్లనుంది. దీంతో నిహారికను పాఠశాల డైరెక్టర్ జగన్ మోహన్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

డ్రైవర్లకు ప్రమాద బీమా

బచ్చన్నపేట, డిసెంబర్ 12 : మండలంలోని కట్కూర్ మాజీ సర్పంచ్ ముశిని సునీతారాజుగౌడ్ తన వివాహ వార్షికోత్సవం సందర్భంగా గురువారం గ్రామంలోని ట్రాక్టర్, ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షల ప్రమాద బీమాను సొంత ఖర్చులతో చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు ముశిని శ్రీశైలం, మాజీ సర్పంచ్ ముశిని ఎల్లయ్యగౌడ్, నాయకులు అశోక్, ఎర్ర శ్రీనివాస్, పబ్బాల రాజు, ప్రశాంత్, గుడుగుల రాజు, శ్రీనివాస్, మర్రికింది రాజు, ప్రవీణ్, శ్రీకాంత్‌రెడ్డి, నరేశ్, రవి, లింగం, సతీశ్ పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న రాజ్‌కుమార్ శాస్త్రి

ఒబులాపూర్ వాసికి జ్యోతిష్య శిరోమణి అవార్డు

జఫర్‌గఢ్, డిసెంబర్ 12 : మండలంలోని ఒబులాపూర్‌కు చెందిన నంచర్ల రాజ్‌కుమార్ శాస్త్రి జ్యోతిష్య శిరోమణి అవార్డు అందుకున్నారు. ఏపీలోని తిరుపతిలో ఈ నెల 11న సీవీఎల్ అక్షర ఫౌండేషన్, ఎన్ఎస్, ఆర్యన్ ఆస్ట్రాలజీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్ట్రాలైజర్లు నరసింహస్వామి, నారాయణ, జనార్దన్, గోపీనాథ్ చేతుల మీదుగా రాజ్‌కుమార్ శాస్త్రి ఈ అవార్డు అందుకున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338978-All

CHANGE OF NAME

★I, MEER YAKUB PASHA R/o. 11-23-1359/A, L.B. Nagar, Warangal hereby changed the name of my minor daughter from BUSHRA MEER YAKUB TO BUSHRA. Hence forth, she will be known as BUSHRA D/o MEER YAKUB PASHA.
NTW-17398

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివాంచు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

తెలంగాణ ఉద్యమ ప్రతిరూపమే బతుకమ్మ

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య
- తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాభిషేకం

స్టేషన్‌ఘన్‌పూర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 12 : తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ఒక భాగమని, ఉద్యమ ప్రతిరూపమే బతుకమ్మ అని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. కేసీఆర్ పాలనలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం రూపు రేఖలను సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మార్చడం, చేతిలో బతుకమ్మను తొలగించడాన్ని నిరసిస్తూ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన వద్ద గల తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పుష్పాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జాతీయ రహదారులపై, గ్రామాల్లో జరిగిన ధర్నాలు, రాస్తారోకోలు, ధూంధాం, వంటావార్పు కార్యక్రమాల్లో బతుకమ్మ ఆడుతూ మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారని గుర్తు చేశారు. 2007లో ప్రొఫెసర్ జయశంకర్ సార్, హైదరాబాద్ స్థాయిలో మేధావులు, విద్యావంతులు, తెలంగాణ వాదులు కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేశారన్నారు. వారందరి కంటే రేవంత్‌రెడ్డి మేధావా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధిని పక్కన పెట్టి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాలను తొలగించేందుకు ఎక్కువగా కృషి చేస్తున్నాడని విమర్శించారు. ఎన్నికల ముందు కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, మహిళలకు రూ.2500, విద్యార్థినులకు స్కూటీ వంటి ఎన్నో హామీలు ఇచ్చి, వాయిదాలు పెడుతున్నాడన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తున్న సీఎంకు ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, మండల మహిళా అధ్యక్షురాలు పావని, మాజీ సర్పంచ్ సురేశ్, చందర్‌రెడ్డి, కుంభం కుమార్, బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జి లకావత్ చిరంజీవి, కనకం గణేశ్, హీరాసింగ్, యేసుబాబు, బంగ్లా శ్రీనివాస్, గుండె రంజిత్, మాతంగి దేవయ్య, ఆకారపు అశోక్, గుండె మల్లేశ్, మునిగల రాజు, గాదే రాజు, మారపాక అనిల్ పాల్గొన్నారు.

జర్నలిస్టుకు పరామర్శ

జనగామ చౌరస్తా : జనగామలోని ధర్మకంచ ఏరియాకు చెందిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు తిప్పారపు ఉపేందర్‌ను మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య పరామర్శించారు. ఇటీవల ఉపేందర్ తండ్రి చంద్రయ్య మృతి చెందగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు మల్లిగారి రాజు, ఉడుగుల కిష్టయ్య, భాగ్య, నర్సింహులు, గండి యాదగిరి పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగి ఖాతాల్లో సొమ్ము స్వాహా

రూ.1.15లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

పాలకుర్తి, డిసెంబర్ 12 : సైబర్ నేరగాళ్ల వలలో ఓ బ్యాంక్ ఉద్యోగి చిక్కుకొని రూ. 1.15 లక్షలు పోగొట్టుకున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలంలోని కొండాపురం శివారు మేకల తండాకు చెందిన లకావత్ ప్రతాప్ స్థానిక పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో ఉద్యోగి. అతడికి వివిధ బాంక్‌ల్లో మూడు ఖాతాలుండగా వాటిలో నుంచి ఈ నెల 10న రూ. 2.50 లక్షలు డ్రా చేశాడు. వాటిలో ఇంకా రూ. 1.15 లక్షలుండగా బుధవారం ఎలాంటి లింక్‌లు, ఓటీపీలు రాకుండానే అవి కట్ అయ్యాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రతాప్ వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారం ఇచ్చి తన ఖాతాలను సీజ్ చేయాలని కోరాడు. అనంతరం సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. తను బ్యాంక్ ఉద్యోగినని, ఇలా ఎలా జరిగిందో అర్థం కావడం లేదని వాపోయాడు. కాగా, గతంలో కూడా పాలకుర్తికి చెందిన ఓ వ్యాపారి నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 90 వేలు కాజేశారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా చేయాలి

సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో సరిత

బచ్చన్నపేట, డిసెంబర్ 12 : జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డిప్యూటీ సీఈవో సరిత అన్నారు. గురువారం ఆమె బచ్చన్నపేటలో నిర్వహిస్తున్న ఇంటింటా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికీ సిబ్బంది వెళ్లాలన్నారు. ఇంటికి సంబంధించి మూడు ఫొటోలు, స్థలం, ఇంటి యజమాని ఫొటో, ఇంటి పన్ను రశీదు అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ శ్రీనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటాచారి, సిబ్బంది అశోక్, మురళి, పంచాయతీ కార్యదర్శులు రేవతీ గౌడ్, కవిత, రుబీనా, రూపాచైతన్య, భాను, ప్రశాంత్ ఆచార్యా, మధు, కరుణాకర్, అనిల్‌రాజ్, వెంకట్ పాల్గొన్నారు

విద్యుత్ సమస్యల పరిష్కారమే ధ్యేయం

మాట్లాడుతున్న వేణుగోపాల్ చారి

తరిగొప్పుల, డిసెంబర్ 12 : విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడమే తమ ధ్యేయమని టీజీఎన్పీడీసీఎల్ విద్యుత్ వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు వేణుగోపాల్ చారి అన్నారు. గురువారం మండల కేంద్రంలో విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశాక పరిష్కారం కాకపోతే రాతపూర్వకంగా కానీ, ఆన్‌లైన్ ద్వారా కాని ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యులు చరణ్‌దాస్, రమేశ్, తరిగొప్పుల, నర్మెట్ట, రఘునాథపల్లి డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కొడకండ్ల విద్యార్థుల ప్రతిభ

మోక్షజ్ఞ

నాగవైష్ణవి

కొడకండ్ల, డిసెంబర్ 12 : సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కొడకండ్ల టీజీఆర్ఎస్ గురుకుల విద్యార్థినులు ప్రతిభ చూపి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థులు పీ మోక్షజ్ఞ ప్రథమ స్థానం, బీ నాగవైష్ణవి ద్వితీయ స్థానం పొందినట్లు పేర్కొన్నారు. ఈ నెల 18న నిర్వహించే జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో వీరు పాల్గొంటారని వివరించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

బచ్చన్నపేట, డిసెంబర్12 : విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఆదిరెడ్డి అకాడమీ చైర్మన్ డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలకేంద్రంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నరేందర్‌రెడ్డి పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలరాజు, ఫోరం మండల కన్వీనర్ యదగిరి, అకాడమీ జిల్లా ప్రతినిధి గొట్టె కనకయ్య, ఉపాధ్యాయులు గట్టు రామచంద్రం, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్, జీవనకుమారి, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

మాట్లాడుతున్న దొమ్మాట శ్రీనివాస్

జనగామ చౌరస్తా, డిసెంబర్ 12 : సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని టీపీటీఎఫ్, డీటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు దొమ్మాట శ్రీనివాస్, ఇప్పరాంరెడ్డి, మహిపాల్‌రెడ్డి అన్నారు. కలెక్టరేట్ ఎదుట 3వ రోజు కొనసాగిన సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక నిరాహార దీక్షకు గురువారం వారు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెట్టి చాకిరి నుంచి సమగ్ర శిక్ష ఉద్యోగులకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జేఏసీ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సురేందర్, జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేశ్, ప్రధాన కార్యదర్శి దయాకర్ గౌడ్, కోశాధికారి గోలి రవీందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు శ్రీలత, ఎండబట్ల శ్రీనివాస్, అన్నపూర్ణ, రాణి, సుకన్య, రజిత, సునీత, జ్ఞానానందం, బాకీ వెంకటేశ్వర్లు, రామచందర్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్లనాగుల రాజు, శ్రీహరి, సత్యనారాయణరెడ్డి, లక్ష్మణ్ జీ, రాజారెడ్డి, రాజేందర్, గణేశ్, ప్రభాకర్, శివ కుమార్, శ్రీనివాస్, నరహరి, కనకయ్య, శ్రీనివాస్, డీటీఎఫ్ నాయకుడు చొక్కయ్య, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లారెడ్డి, బికోజీ పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

కృష్ణవేణిని సన్మానిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, డిసెంబర్ 12 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'విజయోస్తు' కార్యక్రమంపై ఎంఈవోలు, హెచ్ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్టడీ అవర్స్‌లో విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో బోధన తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. డిసెంబర్ 31లోపు సిలబస్ పూర్తి చేసి, జనవరి, ఫిబ్రవరిలో మాక్ టెస్ట్‌లు నిర్వహించాలన్నారు. 66 రెసిడెన్షియల్ స్కూల్స్‌లో విద్యార్థుల సౌకర్యార్థం కంప్లెయింట్ బాక్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని స్కూళ్లలో బాలికా సాధికారత క్లబ్‌లు ఏర్పాటు చేసి, వాటిలో గ్రీవెన్స్ బాక్స్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

14న డైట్ అండ్ కాస్మోటిక్స్ చార్జీల పెంపు వేడుకలు

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు, పాఠశాలల్లో ఈ నెల 14న డైట్ అండ్ కాస్మోటిక్స్ చార్జీల పెంపు వేడుకలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి ఎంఈవోలు, వసతి గృహాల వార్డెన్లు, హెచ్ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం డైట్ అండ్ కాస్మోటిక్స్ చార్జీలను పెంచిందని, దీంతో జిల్లాలోని 66 విద్యా సంస్థల్లో ఈ నెల 14న ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గోల్డ్‌మెడలిస్టు కృష్ణవేణికి సన్మానం

కాంబోడియాలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల త్రోబాల్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన మాచర్ల కృష్ణవేణిని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సన్మానించారు. అంతర్జాతీయ పోటీల్లో గోల్డ్ మెడల్‌ను సాధించిన ఆమె జిల్లాకు గొప్ప పేరు తీసుకొచ్చిందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన కృష్ణవేణి పుట్టుకతో దివ్యాంగురాలు. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఆటల్లో రాణిస్తున్న ఆమె ప్రస్తుతం కేయూ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో పీహెచ్‌డీ చేస్తున్నది. కృష్ణవేణిలోని ప్రతిభను గుర్తించిన పారా ఒలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా మెంబర్ సింగారపు బాబు త్రోబాల్‌లో మరింత మెరుగైన శిక్షణ అందించగా, అంతర్జాతీయ పోటీల్లో తన సత్తా చాటింది. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి ఫ్లోరెన్స్, జిల్లా క్రీడలశాఖ అధికారి వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

విద్యతోపాటు క్రీడలపై దృష్టి పెట్టాలి

దేవరుప్పుల, డిసెంబర్ 12 : విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై దృష్టి పెట్టాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సాయి ప్రశాంతి విద్యానికేతన్‌లో గురువారం జరిగిన మండల స్థాయి సీఎం కప్ ముగింపు వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంఈవో కళావతి, హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ తోటకూరి పాండు కృష్ణ, నల్ల శ్రీరాం, కాసారపు ధర్మారెడ్డి, పులిగిల్ల వెంకన్న, భూక్యా సజ్జన్, ఇనుముల నాగరాజు, ఓడపల్లి రవీందర్ పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న గ్రూప్-2 ప్రశ్న పత్రాలు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 12 : టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 ప్రవేశ పరీక్షకు సంబంధించిన ప్రశ్న పత్రాలు, ఓఎంఆర్ షీట్లు, బయోమెట్రిక్ మిషన్లు గురువారం రెండు ప్రత్యేక వాహనాల్లో జనగామ జిల్లాకు చేరుకున్నాయి. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజ మహేంద్ర నాయక్, పరీక్ష నిర్వహణ కోఆర్డినేటర్ డాక్టర్ నర్సయ్య సమక్షంలో ప్రశ్న పత్రాల బాక్సులను కలెక్టరేట్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో పటిష్టమైన బందోబస్తు మధ్య సీల్ వేసి భద్రపర్చారు. జిల్లా కేంద్రంలోని 16 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షకు 5,471 మంది హాజరుకానున్నారు. పరీక్ష సజావుగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మన్సూరీ, ఏసీపీ పార్థసారథి, అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాసంగి వరకు రైతులకు గోదావరి జలాలు

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘనపురం : 108 అంబులెన్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

లింగాలఘనపురం/చిల్పూరు, డిసెంబర్ 12 : నియోజక వర్గంలోని రైతులకు యాసంగి వరకు గోదావరి జలాలను అందించనున్నట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. లింగాలఘనపురంతోపాటు చిల్పూరు మండలం మల్కాపూర్ పీహెచ్‌సీలకు మంజూరైన 108 అంబులెన్స్ వాహనాలను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగాలఘనపురంలోని అశ్వరాయపల్లి కుడికాలువ పనులను వేగవంతం చేశామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో వంద పడకల దవాఖానను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రఘునాథపల్లి మండలం కంచనపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ మండలం పెద్దపెండ్యాల, చిల్పూరుకు నూతన పీహెచ్‌సీలు మంజూరైనట్లు తెలిపారు. లింగాలఘనపురంలో కూడా మరో పీహెచ్‌సీకి ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీఎంహెచ్‌వో మల్లికార్జునరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి, ఎంసీహెచ్ ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ కొల్లూరి నరసింహులు, విండో చైర్మన్లు మల్గ శ్రీశైలం, ఉపేందర్, డాక్టర్లు రవితేజ,హారిక,కిరణ్, సుస్మిత,సంధ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో జలేంధర్‌రెడ్డి, ఎంఈవో విష్ణుమూర్తి పాల్గొన్నారు. మల్కాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో చిల్పూరు దేవస్థానం చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్ రావు, మార్కెట్ చైర్మన్ జూలుకుంట్ల లావణ్యశిరీశ్‌రెడ్డి, డైరెక్టర్ యశ్వంత్‌రెడ్డి, గనగోని రమేశ్, ఆర్డీవో డీఎస్ వెంకన్న, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో శంకర్‌నాయక్, ఎంఆర్ఐ శ్రీనివాస్, ఎంపీవో మధుసూదనాచారి, డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధీర్, వైద్యాధికారి కుషాలి, ఎస్కే నజీరుద్దీన్, మంద శ్రీనివాస్, అమర్‌నాథ్, రమేశ్, మోహన్ పాల్గొన్నారు.

జిల్లాకు నాలుగు కొత్త '108' వాహనాలు

స్టేషన్ ఘన్‌పూర్, డిసెంబర్ 12 : జనగామ జిల్లాకు నాలుగు 108 వాహనాలు మంజూరయ్యాయి. కొత్తగా ఏర్పడ్డ జిల్లాలో 12 మండలాలు, 191 గ్రామాలు, 5,66,376 జనాభ ఉండగా మండలానికి ఒక 108 వాహనం ఉండాల్సి ఉంది. అయితే, ఇన్ని రోజులు కేవలం 7 వాహనాలతో క్షతగాత్రుల, రోగుల ప్రాణాలను కాపాడే ప్రయత్నం చేశారు. జిల్లాలోని చిల్పూర్, లింగాలఘన్‌పూర్, నర్మెట, బచ్చనపేట, తరిగొప్పుల మండలాల్లో 108 వాహనాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలు అందక చాలా వరకు ఆర్థిక నష్టం, ప్రాణ నష్టం జరిగింది. అంతే కాకుండా వాహనాల కొరత వలన దూరం నుంచి 108 వాహనం వచ్చే వరకు ఆలస్యం కావడంతో సిబ్బందిపై బాధితులు ఆక్రోశానికి గురయ్యేవారు. ఇదే విషయాన్ని

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

వివరిస్తూ 'అత్యవసర వైద్య సేవలకు ఆలస్యం..' శీర్షికతో అక్టోబర్ 27న (45 రోజల క్రితం) నమస్తే తెలంగాణ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. రాష్ట్రంలో 136 కొత్త 108 వాహనాలను మంజూరయ్యాయని, కలెక్టర్, ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రయత్నిస్తే వాహనాలు వస్తాయని 'నమస్తే తెలంగాణ' వివరించింది. దీనికి స్థానిక ఎమ్మెల్యేలు, కలెక్టర్ స్పందించారు. ప్రస్తుతం జిల్లాలో నూతనంగా నాలుగు 108 వాహనాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. చిల్పూర్, లింగాలఘన్‌పూర్, నర్మెట, బచ్చనపేట మండలాలకు నూతన వాహనాలు అందుబాటులోకి రాగా తరిగొప్పుల మండలానికి వాహనం రావాల్సి ఉంది.

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకపోయిన 'నమస్తే తెలంగాణ'

జిల్లాలో 108 వాహనాల కొరత వల్ల ప్రజలు, సిబ్బంది పడుతున్న ఇబ్బందులపై నమస్తే తెలంగాణ దినపత్రిక ప్రభుత్వానికి చేరేలా కథనాన్ని ప్రచురించింది. జిల్లాలో ఐదు వాహనాలు కొరత ఉండగా ప్రస్తుతం నాలుగు నూతన 108 వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో అంబులెన్స్‌ల కొరత వల్ల సమస్య ఉన్న ప్రాంతానికి 25 నిమిషాల్లో చేరుకునేది. కానీ ఇప్పుడు నాలుగు వాహనాలు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం 13 నిమిషాల్లోనే స్పాట్‌కు చేరుకోవచ్చు. నమస్తే తెలంగాణ కథనంతో జిల్లా ప్రజలకు మేలు జరిగింది. వచ్చే మార్చి చివరి నాటికి రాష్ట్రంలో పూర్తి స్థాయిలో వాహనాలు అందుబాటులోకి రానున్నట్లు సమాచారం.

– మంద శ్రీనివాస్, 108, 102 సర్వీస్ జిల్లా మేనేజర్

దేవరుప్పుల : ఎర్రగుంట తండాలో రాజమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, డిసెంబర్ 12 : మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. పెద్దతండాలో గుగులోత్ బిక్కన్ నాయక్ రోడ్